## లీజుకు ఆర్టీసీ స్థలాలు

పార్వతీపురం టౌన్, జూన్6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, పాచిపెంట బస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలను 15 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వనున్నామని ఉమ్మడి జిల్లాల జోన్-1 డిప్యూటీ సీటీఎం (ఆపరేషన్ అండ్ కార్గో) బి.అప్పలనాయుడు తెలిపారు. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నామని శుక్రవారం పార్వతీపురంలో తెలిపారు. ఈనెల 16 లోగా ఆర్టీసీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని, 17న విజయ నగరం ఆర్టీసీ జోనల్ ఆఫీసుకు అందించాలన్నారు. ఇతర వివరాలకు ఈ 99592 25581 , 99592 25621 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# ప్రకృతి సాగు.. బహుబాగు



టమాటా సాగు చేస్తున్న రైతు గణేష్

● అంతర పంటలతో ఆదర్శంగా నిలుస్తున్న మామిడిపల్లి రైతు

సాలూరు రూరల్, జూన్6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సాగు పద్ధతిలో వివిధ రకాల పంటలను పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు సాలూరు మండలం మామిడిపల్లికి చెందిన సువ్వాడ గణేష్. ఈ తరహా పంట ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ఇది సురక్షిత ఆహారమని అధికారుల ద్వారా తెలుసుకున్నారు. వారి సలహా, సూచనలతో సాగు చేపట్టి విజయం సాధించారు. తొలుత గ్రామంలోని తన ఐదు ఎకరాల్లో పామాయిల్ వేశారు. అయితే ఆయా మొక్కలకు మధ్య ఉన్న ఖాళీ ప్రదేశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకున్నారు. ఈ మేరకు ప్రకృతి సాగు పద్ధతుల్లో అంతర పంటలుగా టమాటా, బొప్పాయి, వంగ, మిరప, బంతి, చామంతి, కొమ్ముశనగ సాగు చేపట్టారు. ఒకే ప్రాంతంలో వివిధ రకాల పంటలను పండించి సత్ఫలితాలు పొందారు. పామాయిల్ చేతికొచ్చే సమయం కంటే ముందే పూలు, కూరగాయలు, బొప్పాయి ద్వారా ఆయన అధికాదాయం పొందుతున్నారు. వాస్తవంగా ప్రకృతి సాగు పద్ధతుల్లో పండించే వాటికి డిమాండ్ ఎక్కువ. దీంతో కూరగాయలు తదితర వాటిని విక్రయిస్తూ.. ప్రకృతి సాగును లాభసాటిగా మార్చుకున్నారు. మొత్తంగా ఆరోగ్యకర పంటలను అందిస్తూ పలువురు రైతులకు ఆయన మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

నేడు 'ప్రపంచ సురక్షిత ఆహార దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనాలు..

6లో



బొప్పాయి సాగు ఇలా..

## జగన్ తీరు మార్చుకోవాలి

● పోలీసులపై విమర్శలు చేస్తారా: మంత్రి సంధ్యారాణి

8లో

## జ్వరంతో గిరిజనుడి మృతి

8లో

## ఆ పాఠశాలకు 75 ఏళ్లు

● వజ్రోత్సవాలకు సిద్ధమైన వీరఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాల

● రేపు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు

6లో



# మూడేళ్లవుతున్నా: ఇన్‌చార్జిలే దిక్కు!

● జిల్లాలో కీలక శాఖలకు పూర్తిస్థాయి అధికారులేరీ?

● పొరుగు జిల్లాల వారికే అదనపు బాధ్యతలు

● ప్రజలకు పూర్తిస్థాయిలో అందని సేవలు

● జిల్లా ప్రగతిపై ప్రభావం

● పోస్టుల భర్తీపై దృష్టి సారించని గత వైసీపీ సర్కారు

● రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజల విన్నపం

పార్వతీపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా.. ఇంకా కీలక శాఖలకు పూర్తిస్థాయి అధికారులు లేరు. ఇన్‌చార్జితోనే కాలం నెట్టుకొస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన వారే అనేక శాఖలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. జిల్లా ప్రగతిపై కూడా ఆ ప్రభావం పడుతోంది. ప్రధానంగా అభివృద్ధి పనులు, గృహ నిర్మాణాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఎంతో హడావుడిగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన గత వైసీపీ ప్రభుత్వం మౌలిక వసతులు, కార్యాలయాల ఏర్పాటు, అధికారుల నియామకంపై దృష్టి సారించలేదు. దీంతో జిల్లాలో పాలనా వ్యవస్థ ఇంకా గాడిన పడడం లేదు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని జిల్లావాసులు కోరుతున్నారు.




పార్వతీపురం కలెక్టరేట్




### వివిధ శాఖల్లో పరిస్థితి ఇదీ..

జిల్లా విద్యాశాఖకు పూర్తిస్థాయి అధికారి లేరు. ఇన్‌చార్జి డీఈవోగా రాజ్‌కుమార్ కొనసాగుతున్నారు. బీసీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మన్యంలో పనిచేస్తున్న గడ్డెమ్మ శ్రీకాకుళంలో పూర్తిస్థాయి అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా ఉన్న వెంకటేశ్వరరావు కూడా విజయనగరంలో పూర్తిస్థాయి బాధ్యతలు చేపడుతున్నారు. క్రీడాశాఖ అధికారి వెంకటేశ్వరరావును ఇటీవల విజయనగరం బదిలీ చేశారు. అయితే తిరిగి ఆయన్నే జిల్లాకు ఇన్‌చార్జిగా నియమించారు. విజయనగరం మెప్మా పీడీ చిట్టి రాజును

(మిగతా 8వ పేజీలో...)

## 9న జిల్లాకు
# మంత్రి లోకేశ్ రాక



పార్వతీపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ నెల 9న జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడుతూ.. టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించనున్నారని చెప్పారు. వారితో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొం టారని వెల్లడించారు. జిల్లాలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు సకాలంలో వేదిక వద్దకు చేరుకోవాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

### పర్యటన విజయవంతం చేయండి: మంత్రి

పార్వతీపురంలో మంత్రి లోకేశ్ పర్యటన విజయవంతం చేయాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శ్రేణులకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సారిగా ఆయన 'మన్యం' వస్తున్నట్లు తెలిపారు. స్థల పరిశీలన, ఏర్పాట్లు ఇతర అంశాలపై శనివారం జిల్లా ఎమ్మెల్యేలతో చర్చించనున్నట్లు తెలిపారు.

### స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే

పార్వతీపురం రూరల్: విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో చిన్నబొండపల్లి గ్రామ పరిధిలో ఎమ్మెల్యే విజయచంద్ర స్థల పరిశీలన చేశారు. విజయవాడ నుంచి వచ్చిన ప్రత్యేక బృందంతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. మంత్రి లోకేశ్ సభకు ఈ ప్రాంతం అనువుగా ఉంటుందని భావించారు.

● జిల్లాలో టెన్త్ పరీక్షల్లో ప్రతిభ చూపిన వారు 95 మంది, ఇంటర్‌లో 26 మంది ఉన్నారు. షైనింగ్ స్టార్స్ పేరిట వారిని మంత్రి లోకేశ్ అభినందించనున్నారు.



చిన్నబొండపల్లిలో స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర తదితరులు

## సర్వే పూర్తిచేయండి

● ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఎంపిక చేసిన 88 గిరిజన గ్రామాల్లో పీఎం జుగా సర్వే ఈనెల 13 నాటికి పూర్తిచేయాలని ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఎంపీడీవోలు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మండలంలో సచివాలయ సిబ్బందితో హౌస్‌హోల్డ్ సర్వే పక్కాగా చేయాలన్నారు. యాప్ ద్వారా చేపట్టే సర్వేలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని సూచించారు. పూర్తిస్థాయిలో లబ్ధిదారుల వివరాలను నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఏపీవో జి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



సర్వేపై సూచనలిస్తున్న ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

# పగలంతా తోటల్లో.. సాయంత్రం జనావాసాల్లోకి..

● భామిని, గరుగుబిల్లి, సీతానగరం మండలాల్లో గజరాజుల హల్‌చల్ ● భయాందోళనలో గ్రామస్థులు

భామిని, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భామిని మండలం తాలాడలో గజరాజులు హల్‌చల్ చేస్తున్నాయి. పగలంతా తోటల్లోనే ఉంటూ.. సాయంత్రం జనావాసాల్లోకి హడలెత్తిస్తున్నాయి. గురువారం రాత్రి ఆ గ్రామంలోని 28 మొక్కజొన్న గింజల బస్తాలను చిందరవందర చేశాయి. దీంతో ఆ రైతు లబోదిబోమంటున్నాడు. 15 రోజులుగా ఏనుగులు ఆ ప్రాంతంలోనే సంచరిస్తుండడంతో తాలాడ, ఘనసర, కీసర, కోసలి గ్రామస్థులు సాయంత్రం బయటకు రావాలంటేనే బెంబేలెత్తి పోతున్నారు. రైతులు పొలం పనులకు కూడా వెళ్లలేకపోతున్నారు. ఏ క్షణాన ఎటువైపు నుంచి ఏనుగులు దాడి చేస్తాయోనని తీవ్ర భయాందోళన చెందుతున్నారు.





తోటల్లో సంచరిస్తున్న ఏనుగులు, తాలాడలో మొక్కజొన్న గింజల బస్తాలను చిందర వందరగా పడేసిన దృశ్యం

### చినగుడబలో ...

గరుగుబిల్లి: గరుగుబిల్లి మండలంలో ఉన్న గజరాజుల గుంపు కూడా స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కొద్ది రోజులుగా గొట్టివలస, దళాయివలస, తులసిరామి నాయుడు వలస, తదితర గ్రామాల్లో సంచరించిన ఏనుగులు శుక్రవారం చినగుడబకు చేరుకున్నాయి. పిల్లవాని చెరువులో

(మిగతా 8వ పేజీలో...)

## తొలిరోజు ప్రశాంతం

● డీఎస్సీ పరీక్షలకు 117 మంది గైర్హాజరు

● కేంద్రాలను తనిఖీ చేసిన విజయనగరం కలెక్టర్


6లో

## మన్యం భగభగ

● రోహిణి కార్తెలో ఠారెత్తిస్తున్న ఎండలు

● ఉక్కపోత, వడగాల్పులతో జనం విలవిల

6లో



## ఆకట్టుకున్న నృత్యరూపకం

పాలకొండ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పాలకొండకు చెందిన చిన్నారులు శుక్రవారం అయోధ్యలో వివిధ నృత్య ప్రదర్శనతో అందర్నీ ఆకట్టుకున్నారు. శ్రీనివాస కల్యాణం, రామాయణం, హనుమాన్ చాలీసా వంటి ఎన్నో నృత్య రూపకాలు ప్రదర్శించారు. భారతీయ సంస్కృతి నృత్య శిక్షణాలయం ఆధ్వర్యంలో విద్యార్థులు నృత్యాలతో అలరించారు. శిక్షకులు నివేదిత శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



అయోధ్యలో నృత్యాలు చేసిన చిన్నారులు

# మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యం



సన్న బియ్యాన్ని బస్తాల్లోకి నింపుతున్న దృశ్యం

● ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలకు తరలించేందుకు చర్యలు

● ప్రత్యేక రైస్ ప్యాకెట్ల పంపిణీకి ఏర్పాట్లు

గరుగుబిల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి ఇకపై సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే సుమారు 490 టన్నులను సిద్ధం చేశారు. 25 కిలోల చొప్పున మొత్తంగా 19,572 ప్యాకెట్లను ప్రత్యేక వాహనాల్లో తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులకు ఒకవైపు మెరుగైన బోధన, మరోవైపు నాణ్యమైన భోజనాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోంది. గతంలో మధ్యాహ్న భోజన పథకానికి రేషన్ దుకాణాల నుంచి బియ్యాన్ని పంపించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం నాణ్యమైన బియ్యం అందించడంలో విఫలమైంది. దీంతో ఎంతోమంది విద్యార్థులు భోజనాన్ని తినలేకపోయేవారు. ఈ సమస్యను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం పోషక విలువలతో కూడిన బియ్యాన్ని పంపిణీ చేయాలని నిర్ణయించింది. విద్యార్థులు రక్తహీనతకు గురికాకుండా ఉండేందుకు గుంటూరు నుంచి ఈ ప్రాంతానికి సన్న బియ్యం సరఫరా

(మిగతా 8వ పేజీలో...)

## సూర్యఘర్‌పై విస్తృత అవగాహన

● కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ యూనిట్ల ఏర్పాటుపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలతో మాట్లాడారు. సూర్యఘర్ ప్రయోజనాలు తెలియజేసి, పథకంపై ఆసక్తి చూపుతున్న వ్యక్తుల పేర్లు నమోదు చేయాలన్నారు. 3 కేవీ యూనిట్ ఏర్పాటు వల్ల

(మిగతా 8వ పేజీలో...)



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

# ప్రకృతి సేద్యం ఆరోగ్యానికి మార్గం

- సాగులో రాణిస్తున్న ఉమ్మడి జిల్లా రైతులు
- రసాయన ఎరువులు, పురుగు మందులకు స్వస్తి
- అంతా ప్రకృతి విధానంలోనే పంటలు
- జీరో బడ్జెట్‌తో అధిక దిగుబడులు
- ఆదర్శంగా నిలుస్తున్న వైనం
- నేడు ప్రపంచ సురక్షిత ఆహార దినోత్సవం

ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్నారు. వరి, మొక్కజొన్న, చెరుకు, అరటి, బొప్పాయి, రాగులు, నువ్వులు, పెసర, మినప, టమాటతో పాటు వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, తీగ, దుంప జాతుల పంటలను పండిస్తున్నారు. గోమూత్రం, పేడనే ఎరువులుగా, క్రిమిసంహారక మందులుగా వినియోగిస్తున్నారు. మొదట్లో వీరు కూడా రసాయన ఎరువులు, పురుగు మందులను ఉపయోగించేవారు. ఈ పంటలను తింటున్న వారిలో క్యాన్సర్, బీపీ, సుగర్ వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలుసుకుని వాటికి స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించారు. జీరో బడ్జెట్‌తో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఈ పంటలు సురక్షితమైనవి, ఆరోగ్యానికి మేలు చేసేవి కావడంతో కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. శనివారం ప్రపంచ సురక్షిత ఆహార దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



గరుగుబిల్లి మండలం ఖడ్గవలసలో ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న వరి (ఫైల్)

## ఆదర్శంగా శ్రీరాములునాయుడు



వరుస పద్ధతుల్లో నాట్లు వేసి జీవ ఎరువులు జల్లుతున్న దృశ్యం

గరుగుబిల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతోషపురం పంచాయతీ ఖడ్గవలసకు చెందిన బంకురు శ్రీరాములునాయుడు ప్రకృతి విధానంలో పలు రకాల పంటలను సాగు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. తనకున్న ఎకరన్నర భూమిలో వరి, మినుము, పెసర, నువ్వులు వంటి పంటలను సాగు చేస్తున్నాడు. పొలం గట్లపై కాయగూరలు, ఆకుకూరలతో పాటు తీగ, దుంప జాతులు, పండ్ల మొక్కలు, కంది పంటలను పండిస్తున్నాడు. ఎకరన్నర భూమిలో 365 రోజులూ పలు రకాల పంటలు సాగు చేస్తున్నట్లు శ్రీరాములు చెబుతున్నాడు.



చీడపీడల నివారణకు కషాయం తయారు చేస్తున్న శ్రీరాములునాయుడు

### ఇంటింటికీ సరఫరా

ప్రకృతి వ్యవసాయ పంటలను ఇంటింటికీ సరఫరా చేస్తున్నాం. వరికి సంబంధించి ఎకరాకు 25 బస్తాల దిగుబడి వస్తుంది. బస్తా ధాన్యం (82 కిలో లు) మరపట్టిస్తే 60 కిలోలు వస్తుంది. కిలో రూ.100కు విక్రయిస్తున్నాం. ఈ లెక్కన బస్తాకు రూ.6వేలు ఆదాయం వస్తుంది. ఎకరాకు రూ.22 వేలు ఖర్చు కాగా, ఆదాయం రూ.2.25 లక్షలు వస్తుంది. పం డించే పంటలను తనిఖీ కోసం గుంటూరులోని పరీక్షా కేంద్రానికి పంపిస్తుంటాం. **-శ్రీరాములునాయుడు, రైతు**

## వృత్తి ఫార్మా సైంటిస్టు.. ప్రవృత్తి ప్రకృతి వ్యవసాయం

భామిని, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం భామినికి చెందిన బిడ్డిక యామిని అనే యువతి ఒకపక్క ఫార్మా సైంటిస్టుగా, మరోపక్క ప్రకృతి వ్యవసాయ రైతుగా రాణిస్తోంది. ఎమ్మెస్సీ పూర్తి చేసిన యామిని ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ సంస్థలో తాత్కాలిక ఫార్మా సైంటిస్ట్‌గా పని చేస్తుంది. ఎలాంటి పురుగు మందులు, రసాయన ఎరువులు వినియోగించకుండా తన సొంత భూమి 20 సెంట్లలో మిరప, గోరుచిక్కుడు, బీన్స్, ఆనపకాయలు, టమాటా వంటి పంటలను సాగు చేస్తుంది. చీడపీడలు ఆశించకుండా జీవామృతం వినియోగిస్తున్నట్లు ఆమె చెబుతున్నారు. అలాగే గతేడాది 50 సెంట్ల విస్తీర్ణంలో ఎటువంటి ఎరువులు వినియోగించకుండా వరిసాగు చేసి 18 బస్తాల దిగుబడి సాధించినట్లు వివరించారు. భూసారం పెంచేం దుకు తొలకరిలో నవధాన్యాలు సాగు చేయాలని రైతులకు సూచిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంతో నీటి వినియోగం తక్కువగా ఉంటుందని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు వస్తాయని అంటున్నారు. ఆరోగ్యకరమైన ఆహారం అందడంతో పాటు పర్యా వరణానికి మేలు కలుగుతుందని, ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని ఆమె సూచిస్తున్నారు.



ప్రకృతి వ్యవసాయం చేస్తున్న యామిని

## 9 గ్రామాలు.. 600 మంది రైతులు

- అంతా ప్రకృతి వ్యవసాయమే



కొండబారిడి గ్రామంలో ఉన్న దంపుడు బియ్యం కేంద్రం



ధాన్యం దంచి బియ్యం తీస్తున్న గిరిజన మహిళలు

కురుపాంరూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండబారిడి కేంద్రంగా గత 20 ఏళ్లగా రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. తొలుత గ్రామంలోని 98 కుటుంబాలు 225 ఎకరాల్లో సేంద్రియ సాగు చేసేవి. ఇటీవల కాలంలో ఈ సాగు కొండబారిడి చుట్టుపక్కల ఉన్న కారిమానుగూడ, కొండవారగూడ, తుమ్మికమానుగూడ, రావిమానుగూడ, పల్లంబారిడి, శాంతినగరం, ఉరిడి, కొత్తగూడ గ్రామాలకు వ్యాపించింది. మొత్తం 600 మంది రైతులు తమ భూముల్లో శతశాతం ప్రకృతి సాగు చేస్తున్నారు. 323 ఎకరాల్లో వరి, 900 ఎకరాల్లో జీడి, కందులు, రాగులు పండిస్తున్నా రు. రైతులు తమ కుటుంబ అవసరాల కోసం కొంత పంటను భద్రపరుచుకుని మిగిలిన ఫలసాయాన్ని సప్తగిరి గ్రామాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రానికి అమ్ముతున్నారు. ధాన్యం, కందులు, రాగులను ఏకలవ్య అన్నపూర్ణ, శాంతి, సావిత్రి మహిళా సంఘాల సభ్యులు ప్రాసెస్ చేసి మార్కెట్లో విక్రయించి ఆదాయాన్ని పొందుతున్నారు. కొండబారిడిలో కేవలం ఆర్‌జీఎల్ రకం దంపుడు బియ్యం విక్రయిస్తున్నారు. కిలో బియ్యం రూ.100కు అమ్ముతుండగా వాటికి విపరీతమైన గిరాకీ ఉంది. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, సంగారెడ్డితో పాటు రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి వంటి ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. అదే విధంగా రాగులును పిండిగా తయారు చేసి కిలో రూ.70కు విక్రయిస్తున్నారు. డిమాండ్‌కు తగ్గట్టు తాము ఉత్పత్తులను సరఫరా చేయలేకపోతున్నట్టు దంపుడు బియ్యం కేంద్రం ఇన్‌చార్జి పత్తిక నరేష్ తెలిపారు

### సరఫరా చేయలేకపోతున్నాం

ప్రకృతి ఉత్పత్తులు గురించి బాగా ప్రచారం అయ్యింది. చాలా మంది ఆర్డర్లు ఇస్తున్నారు. సాధ్యమైనంతలో సరఫరా చేస్తున్నాం. ఉత్పత్తుల నాణ్యంగా ఉండి, బలవర్ధకంగా ఉండటంతో ప్రజలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రకృతి సాగుకు చాలా మంది రైతులు ముందుకువస్తున్నారు.

**- దొల్లు పారినాయుడు, జట్టు సంస్థ వ్యవస్థాపకుడు**

# ఆ పాఠశాలకు 75 ఏళ్లు

- వజ్రోత్సవాలకు సిద్ధమైన వీరఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాల
- రేపు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు




వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

వీరఘట్టం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్థాపించి 75 ఏళ్ల పూర్తయ్యింది. దీంతో ఆదివారం వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 1950 జూన్‌లో ఈ పాఠశాలను స్థాపించారు. పాఠశాల నిర్మాణానికి అవసరమైన ఐదు ఎకరాల స్థలాన్ని కత్తులకవిటి గ్రామానికి చెందిన రైతు చిన్నంనాయుడు దానంగా ఇచ్చారు. తొలుత పూరిపాకలో పాఠశాల ప్రారంభమైంది. క్రమేనా అభివృద్ధి చెందడంతో శాశ్వత భవనాలను నిర్మించారు. ఈ పాఠశాలలో ఇప్పటి వరకు సుమారు ఐదు వేల మంది విద్యార్థులు చదివారు. 245 మంది ఉపాధ్యాయులు పని చేశారు. ఇక్కడ చదివిన వారిలో ఎంతో మంది ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్నారు. పూర్వ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులందరికీ వజ్రోత్సవ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికలను అందించారు. గత ఏడాది నుంచి ప్రణాళిక బద్ధంగా ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ ఎత్తున వజ్రోత్సవ వేడుకలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు కృషి చేస్తున్నారు. సుమారు 1500 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ అపూర్వ ఘట్టానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదిక కాబోతుంది.



వజ్రోత్సవాలకు సిద్ధమవుతున్న వేదిక

# చినరాజేరు.. తాగునీటికి బేజారు

- నెలరోజులుగా సరఫరాకాని నీరు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు
- కోనేటి నీటినే వినియోగిస్తున్న వైనం



కోనేరు నుంచి నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

దత్తిరాజేరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినరాజేరు గ్రామంలో తాగునీటి కష్టాలు నెలకొన్నాయి. నెల రోజులుగా కుళాయిల ద్వారా నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో 60 కుటుంబాలు ఉన్నాయి. వీరికి గ్రామంలోని వాటర్ ట్యాంకు నుంచి నీరు రావాల్సి ఉంది. అయితే, ఈ వాటర్ ట్యాంకు డౌన్‌లో ఉండడం.. గ్రామం ఎత్తులో ఉండడంతో కుళాయిల ద్వారా నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. నిత్యం సమస్య తలెత్తుతుంది. ఇన్నాళ్లు కుళాయిల ద్వారా కొద్దిగొప్పో నీరు వచ్చేది. కానీ, ఇప్పుడు నెల రోజులుగా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో మహిళలంతా గ్రామానికి సుదూరంలో ఉన్న కోనేటికి వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ఆ నీటినే తాగేందుకు వినియోగిస్తున్నారు. గ్రామంలో రెండు బోర్లు ఉన్నప్పటికీ వాటి నుంచి ఉప్పు నీరు వస్తుందని, దీంతో తాగడానికి పనికిరావడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులు తొలగించాలని గ్రామ మహిళలు కోరుతున్నారు.

# మన్యం భగభగ

- రోహిణి కార్తెలో ఠారెత్తిస్తున్న ఎండలు
- ఉక్కపోత, వడగాల్పులతో జనం విలవిల

పాలకొండ/భామిని, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత, ఉక్కపోతతో మన్యం జిల్లా భగభగలాడుతుంది. గత నాలుగు రోజులుగా వడగాల్పులు వీస్తుండడంతో ప్రజానీకం ఉక్కిరిబిక్కిరి అవుతుంది. ఈ ఏడాది మే నెలలో అధికంగా వర్షాలు కురిశాయి. దీంతో వాతావరణం కాస్త చల్లబడింది. రోహిణికార్తె ప్రారంభమై పది రోజుల వరకు కూడా అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో వాతావరణం చల్లగానే ఉంది. అయితే, గత నాలుగు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. జిల్లాలోని 15 మండలాల్లోనూ 38 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్నిచోట్ల సాయంత్రం వేళల్లో అడపాదడపా వర్షం కురుస్తున్నా ఎండ తీవ్రత మాత్రం తగ్గడం లేదు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సూర్యుడు ప్రతాపాన్ని చూపుతున్నాడు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఉదయం 9 గంటల్లోపు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత మాత్రమే రైతులు వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఎండ తీవ్రతకు జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మూగజీవాలు విలవిల్లాడుతున్నాయి. చెరువుల్లో చెట్ల నీడ కింద సేదతీరుతున్నాయి. రానున్న పది రోజుల్లో ఎండ తీ వ్రత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరిస్తుంది.



భామిని: చెరువులో సేదతీరుతున్న గేదెలు



పాలకొండ: జన సంచారం లేక నిర్మానుష్యంగా ఉన్న పాలకొండ ప్రధాన రహదారి

# శారీరక శక్తికి యోగా దోహదం

- డీఎస్పీ రాంబాబు

పాలకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మానసిక, శారీరక శక్తికి యోగా దోహదపడుతుందని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం యోగా గురువు జనార్దనరావు ఆధ్వర్యంలో పోలీసులు, సిబ్బంది యోగసనాలు వేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాంబాబు మాట్లాడుతూ.. ప్రతిరోజూ యోగా చేయడం ఒక అలవాటుగా మారాలన్నారు. యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. మానసిక, శారీరక రుగ్మతలను కార్యక్రమంలో సీఐ ఎం.చంద్రమౌళి ఎస్ఐలు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న పోలీసులు, సిబ్బంది

# తొలిరోజు ప్రశాంతం

- డీఎస్సీ పరీక్షలకు 117 మంది గైర్హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్ జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డీఎస్సీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఐదు కేంద్రాల్లో పరీక్షలు జరగాల్సి ఉండగా మొదటి రోజున మూడు కేంద్రాల్లో మాత్రమే పరీక్ష నిర్వహించారు. రెండు సెషన్‌లో జరిగిన పీజీటీ ఆంగ్ల మీడియం, గణితం, హిందీ, ఫిజిక్స్ పరీక్షలకు మొత్తం 1,171 మంది అభ్యర్థులకు గాను 117 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 8.30 గంటలకే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ప్రతి కేంద్రం వద్ద అభ్యర్థుల హల్ టిక్కెట్లతో పాటు గుర్తింపు కార్డులను అధికారులు పరిశీలించి లోపలకు విడిచిపె ట్టారు. ఉదయం సెషన్‌లో ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో 500 మంది అభ్యర్థులకు 459 మంది హాజరుకాగా, 41 మంది గైర్హాజరయ్యారు. లెండి ఇంజినీరింగ్ కాలేజీ కేంద్రంలో 350 మందికి 317 మంది హాజరయ్యారు. 33 మంది పరీక్షకు దూరంగా ఉన్నారు. ఎంవీజీఆర్‌లో 314 మందికి 272 మంది హాజరు కాగా, 42 మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌లో ఐయాన్ డిజిటల్ జోన్ కేంద్రంలో ఏడుగురు అభ్యర్థులకు గాను ఆరుగురు పరీక్ష రాశారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. విజయనగరం ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ అంబేడ్కర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన వెంట డీఈవో యు.మాణిక్యంనాయుడు, ఇన్‌చార్జి తహసీల్దార్ స్వర్ణకుమార్ ఉన్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

# బీవీ చానల్‌కు మంచిరోజులు

**●ఆధునికీకరణకు రూ.90 లక్షలతో ప్రతిపాదనలు ● ఆయకట్టుదారుల్లో హర్షం**

గజపతినగరం, జూన్6 (ఆంధ్రజ్యోతి): గజపతిగనరం, బొండపల్లి మండలాల పరిధిలోని బీవీ (బొండపల్లి-వెంకటాపురం) చానల్ ఆయకట్టుదారులకు ఎన్నో ఏళ్లనాటి సాగునీటి కల త్వరలో నెరవేరబోతుంది. చంపావతి నది నుంచి బీవీ చానల్‌కు నీరు మళ్లించేందుకు ఈ ప్రాంత రైతులు ఏటా ఆపసోపాలు పడేవారు. నదీ జలాలకు అడ్డంగా ఇసుక బస్తాలు వేసి చానల్‌లోకి నీరు మళ్లించుకునేవారు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి. గజపతినగరం, బొండపల్లి మండలాల్లోని 8 గ్రామాల పరిధిలోని 3 వేల హెక్టార్ల ఆయ కట్టుకు బీవీ చానల్ ఆధారం. అయితే ఏటా చంపావతి నుంచి బీవీ చానల్‌లోకి సాగునీరు సజావుగా వచ్చే అవకాశం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఇటీవల చంపావతిపై పట్రువాడ వద్ద మినీ వంతెన ఏర్పాటు చేశారు. దాంతో బీవీ చానల్ ఎత్తు పెరిగింది. రానున్న ఖరీఫ్‌కు చంపావతి నీరు బీవీ చానల్‌లోకి చేరే అవకాశం లేదని ఆందోళన చెందిన రైతులు.. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు సమస్యను వివరించారు. దాంతో ఆయన స్పందించారు. అందుకు తగ్గట్టే చానల్ ఆధునికీకరణకు అధికారులతో రూ.90 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. త్వరలో నిధులు మంజూరు కానున్నామని ఆయన ప్రకటించారు. దాంతో గజపతినగరం, బొండపల్లి మండలాల పరిధిలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఏటా ఖరీఫ్, రబీ పంటలకు సాగునీరు పుష్కలంగా అందుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పట్రువాడ వద్ద బీవీ చానల్

## సాంఘిక సంక్షేమశాఖ డీడీగా అన్నపూర్ణమ్మ

విజయనగరం కలెక్టరేట్, జూన్6 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఎం.అన్నపూర్ణమ్మను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రామనందం పదోన్నతిపై అనకాపల్లి బదిలీ అయిన విషయం తెలిసిందే.

## నేడు విత్తనాల పంపిణీ

గజపతినగరం, జూన్6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శనివారం వరి విత్తనాల పంపిణీకి సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని ఏడీఏ మహరాజన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

●లక్కవరపుకోట, జూన్6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌నకు సంబంధించిన వరి విత్తనాల మండలంలో సిద్ధంగా ఉన్నాయి. ఎంటీయూ 1121 రకం 1800 క్వింటాళ్లు, స్వర్ణ రకం 250 క్వింటాళ్లు, సాంబమసూరి 200 క్వింటాళ్లు, 1224 రకం 102 క్వింటాళ్లు, 1318 రకం 75 క్వింటాళ్లు,ఇతర రకాలతో కలిపి 2439 క్వింటాళ్ల విత్తనాలను మండలానికి కేటాయించారని ఏవో స్వాతి తెలిపారు.

## హెల్త్ ఎడ్యుకేటర్లకు అధికారి హోదా అభినందనీయం

విజయనగరం రింగురోడ్డు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య శాఖలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్లను డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారిగా పేరు మార్పుతో హోదాను ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు డీవీ గిరిబాబు అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో జీవనరాణిని కలిసి క్యాడర్‌కు సంబంధించి ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో ఎం.చాముండేశ్వరి, కె.ఎర్రన్న, ఆర్.రామతులసీ, డీవీవీ అప్పారావు, అనిల్, ప్రేమ్ కుమార్, ఆర్.ధనలక్ష్మి పాల్గొన్నారు.

## వేంకటేశ్వర ఆలయానికి రూ.లక్ష విరాళం

జామి, జూన్6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమసింగిలో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. శుక్రవారం స్వామివారిని ఆయన దర్శించుకున్నారు. ఆలయం అభివృద్ధిని కొనియాడారు. అందుకు నడుం బిగించిన యువతను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, టీడీపీ నాయకులు పోలిపర్తి స్వామినాయుడు, వర్రి రమణ, దనియాల పైడిరాజు తదితరులున్నారు.

## బాలికకు న్యాయం చేయండి

శృంగవరపుకోట, జూన్6 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతానికి చెందిన దళిత బాలికలకు న్యాయం చేయాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాదారి జయశంకర్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బాలికపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## క్రీడాకారుడికి అభినందనలు

శృంగవరపుకోట, జూన్6 (ఆంధ్రజ్యోతి): యానాంలో స్పోర్ట్స్అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ శిక్షణకు ప్రవేశ అర్హత సాధించిన పట్టణానికి చెందిన క్రీడాకారుడు కండిపల్లి అభిషేక్ రాజును శుక్రవారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అభినందించారు. మంచి క్రీడాకారుడిగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

## రూ.13,444 కోట్లతో రుణ ప్రణాళిక

**●కలెక్టర్ అంబేడ్కర్ ●బ్యాంకర్లతో సమావేశం**



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, జూన్6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.13,444 కోటతో వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ అంబేడ్కర్ విడుదల చేశారు. గత ఏడాది కంటే 19.20 శాతం అదనమని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది వ్యవసాయానికి రూ.8,025 కోట్లను కేటాయించినట్టు వివరించారు. ఎంఎస్ఎంఈ కింద ముద్ర, స్టాండ్ అప్ ఇండియా రుణాల కోసం రూ.1,843 కోట్లు, విద్య, గృహ నిర్మాణ రంగాలకు రూ.282 కోట్లను కేటాయించామని తెలిపారు. ఈ ఏడాది రూ.140 కోట్ల పంట రుణాలు అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. విశ్వకర్మ పథకానికి రుణాలను అందజేయాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం రమణమూర్తి, నాబార్డు డీడీఎం నాగార్జున ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

విజయనగరం క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి ఎస్పీ వినతులు స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖపరమైన సమస్యల పూర్వపరాలు పరిశీలించి పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆదిత్యుడికి క్షీరాభిషేకం

మెరకముడిదాం, జూన్6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామలింగాపురంలో సూర్యనారాయణమూర్తి స్వామి ఆలయం వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సిరూరు వెంకట రమణరాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగింది. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

●వేపాడ: మండలంలోని వీలుపర్తి శివారు చామలాదేవి అగ్రహారంలో నిర్మించిన ఆలయంలో శుక్రవారం శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు విఘ్నేశ్వర పూజ, పుణ్యావచనం, రక్షాబంధనం, మండపారాధనలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శానాపతి లీల, అప్పారావు దంపతులు, అర్జునరావు పాల్గొన్నారు.

●రేగిడి: మండలంలో లచ్చన్నవలసలో కాశీవిశ్వేశ్వర ఆలయ తొమ్మిదో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. ఆలయ ధర్మకర్త, టీడీపీ నేత లచ్చన్నవలస మాజీ సర్పంచ్ లావేటి సత్యంనాయుడు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాజాం టీడీపీ నేత కోండ్రు జగదీశ్ పాల్గొన్నారు.

●బొండపల్లి: మండలంలోని బోడసింగిపేటలోగల రామాలయాన్ని శుక్రవారం జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సందర్శించారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయనతో పాటు గంట్యాడ మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు కోరాడ కృష్ణ, రాపాక అచ్చెనానయుడు, బుచ్చిరాజు, సర్పంచ్‌లు కర్రోతు శ్రీనివాసరావు, ముదునూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

●గంట్యాడ మండలంలోని కొర్లాం గ్రామంలో నిర్మించిన ఆలయంలో సీతారా ముల విగ్రహాల ప్రతిష్ఠోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే పెదమజ్జిపాలెంలో నిర్మించిన ఉమామహేశ్వర ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠోత్సవాన్ని శుక్రవారం చేపట్టారు. మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు పాల్గొన్నారు.

●జామి:జామిలో స్వర్ణాకర్ష రాజరాజేశ్వరీ త్రిపురాంతకస్వామి ఆలయంలో శుక్రవారం కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

●సంతకవిటి, జూన్6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంవలసలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆంజనేయ సమేత వేణుగోపాలకృష్ణ మందిరం ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. వేద పండితుడు పెంట వాసుదేవశర్మ విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోండ్రు జగదీశ్ పాల్గొన్నారు.

## ఘనంగా వేంకటేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ

**●స్వామిని దర్శించుకున్న మంత్రి శ్రీనివాస్**



పూజల్లో మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట, జూన్6 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పుణ్యగిరి కొండ దిగువ భాగంలో నిర్మించిన పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం విగ్రహాలను ఘనంగా ప్రతిష్ఠించారు. వేడుకల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆయనకు ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, టూరిజం డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి దంపతుల ఆధ్వర్యంలో పండితులు ఘన స్వాగతం పలికారు. స్వామి దర్శనం అనంతరం విగ్రహాల ప్రత్యేకతను ఆయనకు ఎమ్మెల్సీ వివరించారు. పుణ్య తిరుమలగిరి క్షేత్రంగా నామకరణం చేశామని తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు బొత్స అప్పల నర్సయ్య, కడుబండి శ్రీనివాసరావు స్వామివారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

●నెల్లిమర్ల: మండలంలోని పూతికపేటలో శుక్రవారం రామాలయ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.

## ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కళావెంకటరావు

చీపురుపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కళావెంకటరావు శుక్రవారం సాయంత్రం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి కార్యకర్తలు, నాయకులు హాజరై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులు అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ప్రజలు ఎదుర్కొన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

## రైల్వే జీఎం నియామకంపై హర్షం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వేజోన్ జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథుర్‌ను నియమించడంపై ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇదొక మంచి తరుణమన్నారు. ఏపీకి కేంద్రం అండగా నిలవడం శుభపరిణామన్నారు. రైల్వేజోన్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపిన కేంద్ర ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణలకు కృతజ్ఞతలు తెలిపారు.

## మరో ముందడుగు



మాట్లాడుతున్న బంగార్రాజు

పూసపాటిరేగ, జూన్6 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వే జోన్‌కు జీఎంగా సందీప్ మాథుర్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించడంతో మరో ముందడుగు పడినట్టయిందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మార్క్‌ఫెడ్ చెర్మన్ కర్రోతు బంగార్రాజు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వేజోన్ ఏర్పాటుకు ప్రభుత్వం 52 ఎకరాల భూమిని కేటాయించిందన్నారు. ఇందుకుగానూ రూ.149 కోట్లను ఖర్చు చేసిందన్నారు. శరవేగంగా పనులు సాగుతున్నాయన్నారు. ప్రధాని మోదీ చొరవతో రైల్వేజోన్ కల నెరవేరిందన్నారు. ఆయనతో పాటు పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి శంకరరావు, నాయకులు ఆకిరి ప్రసాదరావు, పిన్నింటి సన్యాశినాయుడు, విక్రం జగన్నాథం, దంగా భూలోక, పిన్నింటి శ్రీనివాసరావు ఉన్నారు.

### అన్ని సమస్యలు పరిష్కరిస్తాం

భోగాపురం, జూన్6 (ఆంధ్రజ్యోతి): అన్ని సమస్యలు పరిశీలించి పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని పోలిపల్లిలో గల నివాసంలో శుక్రవారం ఆయన కార్యకర్తే అధినేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## రైల్వేజోన్ కల సాకారం



మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కృషితోనే దశాబ్దాల కాలం నాటి విశాఖ రైల్వేజోన్ కల సాకారమైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు.శుక్రవారం చీపురుపల్లిలోని నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ రైల్వేజోన్‌కు జీఎంను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమన్నారు. ఉత్తరాంధ్రపై ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకశ్రద్ధ చూపడంవల్లే రైల్వేజోన్ సాధ్యమైందన్నారు. ఇక యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

## హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



బోర్డులు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భోగాపురం, జూన్6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావాడ పంచాయతీ సర్వే నెంబరు 64లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో ఎట్టకేలకు తహసీల్దారు ఎం.సురేష్ శుక్రవారం బోర్డులు ఏర్పాటు చేయించారు. ఈనెల 5న 'ఆక్రమణ భూముల్లో బోర్డుల ఏర్పాటు ఎప్పుడో?' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి తహసీల్దారు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు వీఆర్వో కాశీశ్వరరావు, సిబ్బంది ఆక్రమణ స్థలానికి వెళ్లి ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

## ఎడ్ల బండిని ఢీకొని వ్యక్తి మృతి



దినేష్ (ఫైల్)

జియ్యమ్మవలస, జూన్6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరజపాడు జంక్షన్‌లో గురువారం రాత్రి ఓ ఎడ్ల బండిని ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలో చినమేరంగి గ్రామానికి చెందిన ముడిలి దినేష్ అలియాస్ పవన్ (26) తన భార్య దివ్యతో బయటకు వెళ్తున్నానని చెప్పి గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై పెదమేరంగి కూడలి మీదుగా పార్వతీపురం వైపు బయలుదేరాడు. పరజపాడు జంక్షన్ వద్ద ఎడ్లబండితో టేకు కర్రలు తీసుకుని కొమరాడ మండలంలోని మాదలింగికి చెందిన దొనక మల్లేష్ వెళ్తున్నాడు. ఎడ్లబండిపై టేకు కర్రలు పొడవుగా ఉండటంతో వాటిని గుర్తించక బలంగా దినేష్ ఢీకొన్నాడు. విషయం గ్రహించిన స్థానికులు 108 వాహనంపై పార్వతీ పురంలోని కేంద్రాసుపత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న చినమేరంగి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పి.అనీష్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. దినేష్‌కు భార్య దివ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి కుమార్తె దీక్షితశ్రీ ఉంది.

## మిస్టరీగా మంగళపాలెం చోరీ కేసు

కొత్తవలస, జూన్6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మంగళపాలెం లో గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీశ్‌బాబు ఇంట్లో గత నెల 25న జరిగిన భారీ చోరీ అంతు చిక్కని మిస్టరీగా పోలీసులకు తయారైంది. చోరీ జరిగి 10 రోజులు కావస్తున్నా పోలీసులకు ఎటువంటి ఆధారం దొరకలేదు. ట్రస్టు చైర్మన్‌గా జగదీశ్‌బాబు జాతీయ స్థాయిలో ఉన్నతాధికారులతో పాటు రాష్ట్రస్థాయిలో పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో ఉన్న సత్సంబంధాల కారణంగా పోలీసులపై తీవ్ర ఒత్తిడి ఉంది. దాంతో ఈ కేసును ఎలాగైనా చేధించాలనే దానిపై ఆదేశాలు రావడంతో ఒకపక్క సీసీఎస్ పోలీసులు, మరోపక్క జిల్లాకు పోలీసులు బృందాలుగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుంది. కొత్తవలస సీఐ షన్ముఖరావు ఆధ్వర్యంలో ఒక బృందం, సీసీఎస్ విభాగానికి చెందిన బృందం మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు వెళ్లి అక్కడ నేరస్థుల వివరాలను ఆరా తీస్తున్నారు. ఎంతో చాకచక్యంగా చోరీకి పాల్పడంపై పోలీసులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా నేర ప్రదేశంలో ఏదో ఒక ఆధారం ఖచ్చితంగా దొరకుతుంది. అయితే ఈ చోరీకి సంబంధించి నేరస్థులకు సంబంధించిన వేలి ముద్రల సేకరణ మినహా ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఈ కేసు మిస్టరీని చేధించడం పోలీసులకు సవాల్‌గా మారింది.

## రేషన్ బియ్యం పట్టివేత



కిండాం అగ్రహారంలో పట్టుబడిన బియ్యం

బొండపల్లి, జూన్6 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొండకిండాంలో కోళ్ల ఫారాలకు అక్రమంగా తరలిస్తున్న 150 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. గొట్లాం బైపాస్ రోడ్డులో బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేశారు. అలాగే కిండాం అగ్రహారంలో 106 బస్తాల్లో 43.80 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం వ్యానులో తరలిస్తుండగా గజపతినగరం సీఎస్ డీటీ కె.తిరుపతిరావు పట్టుకున్నారు. గంట్యాడ మండలం పెదవేమలికి చెందిన బండారు వెంకటయల్లాజీ ద్వారా చీమల వెంకటరమణ కమీషన్ వ్యాపారం చేస్తున్నట్టు గుర్తించారు. వారిపై 6-ఎ కేసు నమోదు చేసినట్టు సీఎస్ డీటీ తెలిపారు.

## పూర్తిస్థాయిలో 'ఉపాధి' కల్పించండి

గరివిడి, జూన్6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండలక్ష్మీపురంలో ఉపాధి హామీ పనులను పూర్తిస్థాయిలో కల్పించాలని వేతనదారులు డిమాండ్ చేశారు. వంద రోజుల పని దినాలుకల్పించడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇక్కడ సుమారు 450 మంది వేతనదారులు ఉన్నారు. వారానికి రెండు, మూడు రోజులు మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్ పనికల్పిస్తున్నారని వేతనదారులు తెలిపారు. అదీ ఏరోజు ఉంటుందో తెలియదన్నారు. దీంతో ఇబ్బంది పడుతున్నామని వారు చెప్పారు. ఈ విషయం ఎమ్మెల్యే కళా వెంకటరావుకు ఫిర్యాదు చేస్తామని సర్పంచ్, టీడీపీ నాయకుడు పాండ్రంకి కామేశ్ అన్నారు. ● కేఎల్ పురంలో ఉపాధి పనులపై ఏపీవో నారాయణరావు వద్ద ప్రస్తావించగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను పిలిపించి మాట్లాడానన్నారు. సక్రమంగా పనులు చేయించాలని మందలించామన్నారు. తరచూ వర్షాలు పడుతుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫీల్డ్ అసిస్టెంట్ తెలిపాడని చెప్పారు.

## ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ చేయండి

గుర్ల, జూన్6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గోషాడలో చేపడుతున్న ఉపాధి పనుల్లో అవినీతి జరుగుతోందని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినట్టు దివ్యాంగుడు మీసాల గోపాలకృష్ణ, గ్రామస్థులు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు.ఇక్కడ గతంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్ రౌతు రాజేశ్వరిని అవినీతి అభియోగాల నేపథ్యంలో ఆమెను తొలగించారన్నారు. ఆమె స్థానంలో కరుమజ్జి నాగమణిని తాత్కాలికంగా నియమించారన్నారు.అయితే నాగమణి బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచే అక్రమాలకు తెరలేపారన్నారు. రోజుకు దాదాపు 40 దొంగ మస్తర్లురోజూ వేస్తున్నారన్నారు. మేట్లకు తెలియకుండా అవినీతికి పాల్పడుతున్నారు. కొందరు వికలాంగులు పనికి వెళ్తే అక్కడ్నుంచి వెళ్లగొడుతున్నారన్నారు. అధికారులు తక్షణమే గ్రామంలో బహిరంగ విచారణ జరిపించాలని వారు కోరారు.

## రూ.600 కూలి ఇవ్వండి

శృంగవరపుకోట రూరల్, జూన్6 (ఆంధ్రజ్యోతి): రోజువారీ రూ.600 కూలి ఇవ్వాలని, 200 పని దినాలు కల్పించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ మామిడివాని బందలో వేతనదారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ మాట్లాడుతూఉపాధి వేతనదారులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని కోరారు.

## జీతాలు చెల్లించండి

లక్కవరపుకోట, జూన్6 (ఆంధ్రజ్యోతి): మండలంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల జీతాలు 15 రోజులలో చెల్లించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు మూడు నుంచి ఆరు నెలల జీతాలు రావా టల్సి ఉందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, పారిశుధ్య కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు జీతాలు ప్రతీనెలా తీసుకున్నట్టు కార్మికులకు కూడా చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా 12 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు.

## ఆడపిల్లల చదువు.. ఇంటికి వెలుగు

గుర్ల, జూన్6 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగు అని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ శకుంతల అన్నారు. శుక్రవారం మండలంలోని కోటగండ్రేడు సెక్టారు కిశోర వికాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు విద్య, ఆరోగ్యం పై ప్రత్యేకంగా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రత్యేక కాలేజీలు ఏర్పాటు చేసిందన్నారు. రక్తహీనత లేకుండా చూసుకునే బాధ్యత వారిపై ఉందన్నారు. మంచి ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు

దత్తిరాజేరు, జూన్6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి విమర్శలు చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఉప సర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం గురువారం న్యాయబద్ధంగా జరిగిందన్నారు. అందులో ఎవరూ ప్రలోభాలు పెట్టలేదన్నారు. అవిశ్వాస తీర్మానానికి మంత్రికి ఎటువంటి సంబంధం లేదన్నారు.ఆయనపై విమర్శలు చేసే స్థాయిలో మీది కాదనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఆయనతో పాటు క్లస్టర్ ఇన్‌చార్జిలు సత్తిబాబు, ఈశ్వరరావు ఉన్నారు.

## ఎస్సీ కాలనీలో చీకట్లు



కాలనీలో వెలగని వీధిదీపం

శృంగవరపుకోట రూరల్, జూన్6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మవరం ఎస్సీ కాలనీలో చాన్నాళ్లుగా వీధిదీపాలు వెలగడం లేదు. చీకట్లో కాలనీవాసులు మగ్గుతున్నారు. చీకటి పడితే ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు పంచాయతీ పాలకులను కోరినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వెలిబుచ్చారు. ఇకనైనా వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

## అధ్వానంగా తాటిపూడి రోడ్డు

శృంగవరపుకోట రూరల్ జూన్ 6(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక ప్రాంతం, మండలంలోని తాటిపూడికి వెళ్లేరోడ్డు అధ్వానంగా ఉంది. మూడేళ్లగా కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో బొడ్డవర కూడలిలో గోతులమయంగా మారింది. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి రోడ్డు మరమ్మతు చేపట్టాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.



బొడ్డవర జంక్షన్‌లో రోడ్డు దుస్థితి

## మూడేళ్లవుతున్నా.. ఇన్‌చార్జిలే దిక్కు!

(5వ పేజీ తరువాయి)

జిల్లాకు ఇన్‌చార్జిగా నియమించారు. శ్రీకాకుళం టూరిజం అధికారి నారాయణరావు, అదే జిల్లాకు చెందిన మత్స్యకార అధికారి సంతోష్‌కుమార్, సిక్కోలులో దివ్యాంగులు, వృద్ధుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కవిత తదితరులు 'మన్యం'లో ఇన్‌చార్జి అధికారులుగా పనిచేస్తున్నారు.

● గృహ నిర్మాణశాఖకు పూర్తిస్థాయి జిల్లా అధికారి లేరు. ఎగ్జిక్యూటివ్, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఇంజనీర్లు కూడా లేరు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో హౌసింగ్ పీడీగా పనిచేసిన రఘురాంకు జిల్లా నుంచి బదిలీ జరిగి సుమారు రెండేళ్లు అయ్యింది. అయితే ఇంతవరకు ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఇన్‌చార్జి పీడీగా ప్రత్యేక ఉప కలెక్టర్ ధర్మాచంద్రారెడ్డి వ్యవహరిస్తున్నారు. ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా ఈ శాఖలో డీఈలే కీలకంగా ఉన్నారు.

● జిల్లా సివిల్ సప్లైస్ అధికారి పోస్టు కూడా ఖాళీగానే ఉంది. ఇన్‌చార్జి డీఎస్‌వోగా డీఆర్వో హేమలత కొనసాగుతున్నారు.

**ఐటీడీఏల్లో ఇలా...**

పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలకు కూడా పూర్తిస్థాయి పీవోలు లేరు. సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాత్సవ, యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఇన్‌చార్జి పీవోలుగా కొనసాగుతున్నారు.

**బదిలీల తర్వాత ఎలా?**

ఉద్యోగుల బదిలీలు తర్వాత జిల్లాలో పరిస్థితి ఏవిధంగా ఉంటుందో చెప్పలేం. మరికొన్ని శాఖల్లో ఖాళీలు ఏర్పడే అవకాశం ఉంది. ఇప్పటికే కొన్ని శాఖలకు చెందిన కొందరు అధికారులు జిల్లా నుంచి వెళ్లిపోయేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. వారు వెళ్లిపోతే తిరిగి ఆయా స్థానాలకు ఇతర జిల్లాల నుంచి అధికారులు వస్తారో.. రారో? తెలియని పరిస్థితి నెలకొంది.

## సూర్యఘర్‌పై విస్తృత అవగాహన

(5వ పేజీ తరువాయి)

ఎక్కువ లోడ్ వినియోగించవచ్చునని తెలిపారు. రూ.1.20 లక్షలు చెల్లించిన వెంటనే సంబంధిత ఏజెన్సీ సౌర విద్యుత్ ఏర్పాటు చేస్తుందన్నారు. రూ.80 వేల వరకు రాయితీ వస్తుందని చెప్పారు. లబ్ధిదారులకు రుణ సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సౌర విద్యుత్‌ను వినియోగించాలని సూచించారు. పార్వతీపురం డివిజన్‌లో ఇప్పటివరకు 147 యూనిట్లు మాత్రమే ఏర్పాటు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత పార్వతీపురం పట్టణంలో ఎస్ఎన్ఎం కాలనీలో చేపట్టిన పీఎం సూర్యఘర్ లబ్ధిదారుల నమోదు కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. పట్టణంలో ఈ యూనిట్ల ఏర్పాటుకు మరికొంతమంది ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చేప పిల్లల ఉత్పాదకత పెంచాలి ● పార్వతీ పురం(కొమరాడ): జిల్లాలో చేప పిల్లల ఉత్పాదకతను పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. కొమరాడ మండలం కోటిపాం గ్రామంలో చేపపిల్లల పెంపకానికి ఉపయోగపడే (కాపిటివ్ సీడ్ నర్సరీ) చెరువు పనులను ప్రారంభించారు. స్టాకింగ్ సైజ్ చేప పిల్లలను ఉత్పత్తి చేసుకొని విక్రయించుకోవచ్చని తెలిపారు. ● కొమరాడ మండలం చినఖేర్జల పంచాయతీ పరిధి బంజుకుప్ప గ్రామంలో వీధిలైట్లను కలెక్టర్ ప్రారంభించారు. స్వచ్ఛంద సేవా సంస్థ జేకేఎస్ ఆధ్వర్యంలో సిగ్నపై ఇన్నోవేషన్ ఇండియా సహకారంతో నాలుగు మండలాల్లో సుమారు 230 గ్రామాలకు వీధిలైట్లు అమర్చారని ఆయన వెల్లడించారు.

# అప్‌గ్రేడ్ కాక.. అగచాట్లు తీరక

**వైద్య సేవలు భేష్**



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు చాలా చక్కగా అందుతున్నాయి. దీంతో మాపాపను ఇక్కడకు తీసుకొచ్చిడెలివరీ చేయించాం.మాపాప, బిడ్డఆరోగ్యంగా ఉన్నారు.

- బి.భారతి, వీరఘట్టం

**సీహెచ్‌సీగా మార్చాలి**



వీరఘట్టం మండలం నుంచే కాకుండా వంగర, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల నుంచి కూడా ఇక్కడకు రోగుల వస్తుంటారు. పీహెచ్‌సీని 30 పడకల ఆసుప త్రిగా చేస్తే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి.

- బి.ప్రదీప్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యుడు

● పెరుగుతున్న రోగుల తాకిడి ● ఇదీ వీరఘట్టం పీహెచ్‌సీలో పరిస్థితి

వీరఘట్టం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అప్ గ్రేడ్ కాకపోవడంతో రోగులకు అగచాట్లు తప్పడంలేదు. ఇక్కడికి ప్రతిరోజు 100 నుంచి 200మంది వరకూ ఓపీ ఉంటోంది. రోగుల తాకిడి పెరుగుతున్నా అప్‌గ్రేడ్‌పై ఉన్నతాధికారులు దృష్టిసారించడం లేదని గిరిజనులు వాపోతున్నారు.

వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంగా మార్చి 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని సుదీర్ఘకాలంగా రోగులు డిమాండ్‌చేస్తున్నారు. ఇక్కడకు వీరఘట్టం మండలం నుంచి కాకుండా వంగర, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల నుంచి కూడా రోగులు వైద్య పరీక్షలకు వస్తుంటారు. ప్రస్తుతం పీహెచ్‌సీగా ఉండడంతో ఆరు బెడ్లు, ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు మాత్రమే ఉన్నారు. సీహెచ్‌సీగా అప్ గ్రేడ్ చేస్తే 30 పడకలు ఏర్పాటుచేయడంతోపాటు ఆరుగురు వరకూ



పీహెచ్‌సీకి వైద్యం కోసం వచ్చిన రోగులు

స్పెషాలిటీ వైద్యులను నియమించే అవకాశముంటుంది. ఇక్కడ ఆదివారం ఒక్కరోజే ముగ్గురు ప్రసవించారు. అయితే ఈ స్థాయిలో సిబ్బంది, వసతులు లేవని వైద్యులు చెబుతున్నారు. రోగుల తాకిడి దృష్ట్యా ప్రస్తుతం డాక్టర్లు బి.ప్రదీప్‌కుమార్, ఎం.సాయికుమార్‌పై పనిభారం పడుతోంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఏజెన్సీ నుంచి జ్వరాలతో నిత్యం అధిక సంఖ్యలో వస్తుండడంతో బెడ్లు సైతం సరిపోవడంలేదు.

## పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

● గ్రంథాలయాల్లో ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటుగా చేసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. జిల్లాలోని శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు శుక్రవారం ముగిశాయి. ఈసందర్భంగా పలుపోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు. ప్రభుత్వ పాఠశాలలకు వేస సెలవులు ప్రకటించడంతో విద్యార్థుల్లో విజ్ఞానశక్తి పెంచేందుకు శాఖా గ్రంథాలయాల్లో ఏప్రిల్ 28 నుంచి శుక్రవారం వరకూ శిబిరాలు నిర్వహించాలని రాష్ట్ర పౌర గ్రంథాలయ సంచాలకులు కృష్ణమోహన్ ఆదేశాలు జారీచేసిన విషయం విదితమే.

పాలకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):గ్రంథాలయం పరిసరాలను పరిశుభ్రంగా మారుస్తానని నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు జనార్దనరావు మాట్లాడుతూ గ్రంథాలయాలను ఉపయోగించుకుంటే ఆలోచనాపరులుగా ఎదుగుతారన్నారు. గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్ బాబు వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు, చిన్నారులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గొర్లె మురళీ, గ్రంథాలయ సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

●బలిజిపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి):బలిజిపేట శాఖా గ్రంథాలయంలో శుక్రవారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల



పాలకొండ: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఆటల, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు హైస్కూల్ హెచ్ఎం రత్నాకర్, పంచాయతీ కార్యదర్శి ఆదిలక్ష్మి బహుమతులను అందజేశారు. ఈ కార్య క్రమంలో లైబ్రేరియన్ రాజగోపాల్ పాల్గొన్నారు.

●గరుగుబిల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గరుగుబిల్లిలో నిర్వాహకులు నల్ల మధుసూదనరావు పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందించారు.

## నేడు సాలూరులో యోగాంధ్ర

సాలూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సాలూరు మునిసిపల్ కార్యాలయం నుంచి బోసుబొమ్మ జంక్షన్‌వరకు శనివారం ఉదయం ఏడు గంటలకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న ర్యాలీలోమంత్రి గుమ్మిడిసంధ్యారాణి పాల్గొనున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే యోగా కార్యక్రమానికి హాజరవుతారు. ఈ మేరకు కార్యకర్తలు, నాయకులు తెలుపురంగు టీషర్టును ధరించి హాజరుకావాలని మంత్రి కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. అలాగే ఉదయం 10 గంటలకు పార్వతీపురంలోని మంత్రి నారాలోకేష్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించనున్నారు.

## హైస్కూల్‌లో సబ్జెక్ట్ టీచర్ల భర్తీ

సీతంపేట రూరల్,జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో ఎట్టకేలకు పూర్తిస్థాయిలో అన్ని సబ్జెక్ట్‌లకు ఉపాధ్యాయుల భర్తీ చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీల్లో సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సబ్జెక్ట్ టీచర్లంతా భర్తీఅయినట్లు హెచ్ఎం వి.వెంకటరావు శుక్రవారం తెలిపారు.దీంతో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు

గరుగుబిల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉల్లిభద్ర, కొంకడివరాన్ని సారా రహిత గ్రామాలుగా గుర్తించినట్లు సీతానగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి. పద్మావతి తెలిపారు. శుక్రవారం మండలంలోని కొంకడివరంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగాఅవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సారా నిరోధానికి అవసరమైన ప్రత్యేకచర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామాల్లో సారాపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామన్నారు. సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలన్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం దుకాణదారులు నిబంధనలు ధిక్కరిస్తేదుకాణాలపై చర్యలు తప్పవన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ అల్లు అప్పలనాయుడు, వీఆర్వో శ్రీనివాసరావు, కార్యదర్శి వైకుంఠరావు, సబ్‌ఇన్‌స్పెక్టర్ షరీఫ్, ఎఫ్ఈవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## కురుపాంలో గాయత్రీదేవి జయంతి



కురుపాం:గాయత్రీదేవి యజ్ఞం నిర్వహిస్తున్న పరివార్ సభ్యులు

కురుపాం ,జూన్6 (ఆంధ్రజ్యోతి): కురుపాంలోని గాయత్రి ప్రజ్ఞం పీఠంలో విశ్వమాత వేద గాయత్రి జయంతి శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా పంచకుండాలు గాయత్రి మహాయజ్ఞంచేశారు.కార్యక్రమంలో గాయత్రి పరివార్ సభ్యులు పాల్గొన్నారు.

### సంతోషిమాత ఆలయంలో హోమం

సీతంపేట రూరల్,జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంతోషిమాత ఆలయంలో అర్చకులు వేమకోటి సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో మండపారాధన, ప్రతిష్ఠా సంకల్పం, దేవాలయ ప్రదక్షిణ, యంత్రస్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, ధేను, దర్పణదర్శనమ్, బలి ప్రదానం, హోమం నిర్వహించారు.

## నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలి

సీతంపేట రూరల్,జూన్ 6(ఆంధ్రజ్యోతి): టెండర్లు దక్కించుకున్న వారంతా నాణ్యమైన సరుకులను సరఫరా చేయాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజనసంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకులాలకు నిత్యవసర సరుకుల సరఫరాకు సంబంధించి టెండర్లు నిర్వహించారు. ఈఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు జీసీసీ ద్వారా 31రకాలకు చెందిన సరుకుల సరఫరాకు టెండర్ల ప్రక్రియ పూర్తిచేశారు. కార్యక్రమంలో ఏపీవో జి. చిన్నబాబు, జీసీసీ డీఎం సంధ్యారాణి, ఏటీడబ్ల్యూవో మంగవేణి, జీసీసీ బీఎంలు డి.కృష్ణ, నర్సింహులు, హెచ్‌డబ్ల్యూవోలు పాల్గొన్నారు.

## పాఠశాలలకు పుస్తకాల తరలింపు

గరుగుబిల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన పుస్తక సామగ్రి తరలింపునకు చర్యలు చేపట్టారు. శుక్రవారం గరుగుబిల్లి నుంచి తొలుత జడ్పీ పాఠశాలలకువాహనాలపై తరలించనున్నట్లు ఎంఈవో-2 కె.కొండలరావు తెలిపారు. ఈనెల 12 నుంచి ప్రారంభంకానున్న దృష్ట్యా ముందుస్తుగానే పాఠశాలలకు చేరవేస్తున్నామని చెప్పారు. తర్వాత యూపీ,ప్రైమరీ పాఠశాలలకు తరలిస్తామని తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లులో అవసరమైన సామగ్రిని విద్యార్థులకు అందించనున్నామన్నారు. కిట్లులో నోట్, టెక్ట్ పుస్తకాలు, బ్యాగులు, బెల్టులును సిద్ధం చేసినట్లు తెలిపారు. బూట్లు, యూనిఫారాలు రావాల్సి ఉందని చెప్పారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

సీతానగరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేకే కుమార్‌వర్మ, ఎంపీపీ ప్రతినిధులు బలగ శ్రీరాంనాయుడు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్‌కు నలుగురి ఎంపిక

భామిని, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్ పాఠశాలలో చదువుతున్న నలుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ తెలిపారు. ఎనిమిదో తరగతి చదువుతున్న గులివిందల సౌమ్య శ్రీ, కోలక లీన శ్రీ, మజ్జి దీపిక, రాజాన ఉమాదేవి ఈ ఏడాది జాతీయ స్థాయిలో పరీక్షలు రాసి అర్హత సాధించారని చెప్పారు. ఈ మేరకు వీరికి వచ్చే నాలుగు సంవత్సరాలు ప్రతిఏటా రూ.12 వేలు మెరిట్ స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

## యోగాతో మానసికోల్లాసం

కురుపాం, జూన్6 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసికోల్లాసం లభిస్తుందని సీఐలు టీవీ తిరుపతిరావు, బి.హరి తెలిపారు. శుక్రవారం కురుపాంలో ఎల్విన్‌పేట, చినమేరంగి సర్కిల్ పరిధిలో ఉన్న పోలీసులు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా సీఐలు,ఎస్ఐలు,ఏఎస్ఐలు,హెచ్‌సీలు,కానిస్టేబుల్,హోంగార్డులు,సచివాలయ మహిళా పోలీసులు పాల్గొని యోగ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణరావు, శివప్రసాద్, రమేష్, నీలకంఠరావు, ట్రైనీ ఎస్ఐలు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

కురుపాం,జూన్6(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలు అందించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి వైద్యులను కోరారు. శుక్రవారం రాత్రి కురుపాం సామాజిక ఆరోగ్యకేంద్రంలో పుష్ప శ్రీవాణి, వైసీపీ నాయకులు వార్డులో వివిధ రోగాలు, జ్వరాలతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పీటీసీ గొర్లి సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ నిషార్ పాల్గొన్నారు.

## జ్వరంతో గిరిజనుడి మృతి

సీతంపేట రూరల్,జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవనాపురం పంచాయతీ పరిధిలోని జగతిపల్లి కీసరగూడ గ్రామానికి చెందిన గిరిజనుడు సవర ఆనందరావు(26) జ్వరం, వాంతులు, విరోచనాలతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల కథనం మేరకు.. రెండురోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆనందరావును గురువారం రాత్రి సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటికే ఆనందరావు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో భార్య మేఘన, గ్రామస్థులు మెరుగైన వైద్యం కోసం పాలకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఆనందరావు మృతిచెందాడు. ఆనందరావుకు భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతితో జగతిపల్లి గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

## జగన్ తీరు మార్చుకోవాలి

● పోలీసులపై విమర్శలు చేస్తారా: మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న సంధ్యారాణి

సాలూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ తీరుమార్చుకోవాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హితవుపలికారు. రాష్ట్రంలో గంజాయి తరలిస్తూ పలుసార్లు పట్టుబడిన మూకలను పరామర్శిస్తే వారిని ప్రోత్సహించినట్లు కాదా అని ప్రశ్నించారు. శుక్రవారం సాలూరులో విలేకరులతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి మానసిక స్థితి ఏంటో ప్రజలు ఈ దశలో బాగా అర్థం చేసుకోవాలన్నారు.సంఘ విద్రోహ చర్యలకు పాల్పడుతూ పోలీసులపై విమర్శలు చేస్తారా అని జగన్‌ను ప్రశ్నించారు. హత్యలు, అత్యాచారాలు, అత్యంత తీవ్రమైన నేరాల విషయంలో పోలీసులు చర్యలు తీసుకుంటే తప్పేంటని నిలదీశారు. అసలైన వెన్నుపోటుదారుడు జగనేనన్నారు. ఐదు సంవత్సరాల పాటుప్రజలు పరిపాలనాబాధ్యత ఇచ్చారనని, ఆ స్థానం దుర్వినియోగం చేసి ఎన్నో అకృత్యాలకు పాల్పడి మళ్లీ తప్పుడుఆరోపణలతో రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తే ప్రజలు మాత్రం మళ్లీ మోసపోరన్నారు. ప్రజలపైనా నిత్యం కడుపుమంటతో ఉన్న వ్యక్తి జగన్‌రెడ్డి అని అన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నిమ్మాది తిరుతిపరావు, గుళ్ల వేణుగోపాలనాయుడు, యుగంధర్, ఆముదాల పరమేశ్, ముఖీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం

● ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



దర్బార్‌లో వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు.శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచివచ్చి తమ సమస్యలపై వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా సమస్యలపై జగదీశ్వరి సంబంధిత అధికారులకు పరిష్కారానికి చొరవ చూపాలనిఆదేశించారు.కార్యక్రమంలోనాయకులు మర్రాపు పురుషోత్తంనాయుడు, అంబటి రాంబాబు, సింహాచలం, పల్లా రాంబాబు, కె.కొండయ్య పాల్గొన్నారు.

## జోన్‌పై గెజిట్ నోటిఫికేషన్ కోసం కృషి

●జీఎంను నియమించడం శుభపరిణామం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న విజయచంద్ర

పార్వతీపురం,జూన్ 6(ఆంధ్రజ్యోతి):రైల్వే జోన్‌పై త్వరలో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు.రైల్వేజోన్ తొలి జనరల్ మేనేజర్‌గా సందీప్‌మాథుర్‌ను నియమించడం శుభపరిణామమన్నారు. శుక్రవారం పార్వతీపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైల్వేజోన్ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రద్ధతీసుకుంటున్నట్టు చెప్పారు. రైల్వేజోన్‌కు అవసరమైన 54 ఎకరాల స్థలాన్ని కేటాయించడంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. దీంతో జోన్ పనులు ముందుకుసాగలేదని పేర్కొన్నారు. టీడీపీప్రభుత్వం అధికారంలోకి రాగానే జోన్‌కు అవసరమైన స్థలాన్ని కేటాయించడంతో 149 కోట్లతో తొమ్మిది అంతస్తుల్లో కార్యాలయ పనులు జరుగుతున్నాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 12 నెలల్లో 75 వేల కోట్లతో నేషనల్ హైవే ప్రాజెక్టు పనులు, 72 వేల కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు కేంద్ర ప్రభుత్వం నుంచి చంద్రబాబునాయుడు తీసుకొని వచ్చారన్నారు.

## పగలంతా తోటల్లో.. సాయంత్రం జనావాసాల్లోకి..

(5వ పేజీ తరువాయి)

ప్రత్యక్షమవ్వడంతో ఉపాధిహామీ పథకం పనులు నిర్వహిస్తున్న వేతనదారులు భయాందోళకు గురయ్యారు. పనులు నిర్వహించకుండా వెనుదిరిగారు. అటవీశాఖ సిబ్బంది, ట్రాకర్లు అక్కడకు చేరుకుని సమీప తోటల్లోకి ఏనుగుల గుంపును తరలించారు. గుంపు సంచరిస్తున్న ప్రాంతాల్లో కవ్వింపు చర్యలకు పాల్పడరాదని సిబ్బంది హెచ్చరించారు. కాగా గ్రామంలోకి మొదటిసారిగా ఏనుగులు రావడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. వాటిని వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.

**బూర్జ సమీపంలో..**

సీతానగరం: బూర్జ సమీపంలో శుక్రవారం రాత్రి ఏనుగులు సంచరించాయి. గురుగుబిల్లి మండలం నుంచి వెంకటాపురం పొలాల మీదుగా సీతానగరం మండలంలోకి అవి వచ్చాయి. అటవీశాఖ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని బూర్జ పొలాల్లోకి ఏనుగులను మళ్లించారు.

## మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యం

(5వ పేజీ తరువాయి)

చేయాలని భావించింది. ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న సమయానికి నాణ్యతతో కూడిన సన్న బియ్యం సరఫరా చేయాలని ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ మేరకు గరుగుబిల్లి మండలం సుంకి ప్రాంతంలో ఫుడ్ కార్పొరేషన్ గోడౌన్ నుంచి పాఠశాలలు, వసతిగృహాలకు బియ్యాన్ని తరలించేందుకు చర్యలు చేపడుతున్నారు.

**ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి తరలింపు**

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు సుంకి గోడౌన్ నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు సన్న బియ్యం తరలించ నున్నాం. అక్కడి నుంచి రూట్ మ్యాప్ మేరకు పంపిణీ చేస్తారు. ముందస్తుగా బియ్యాన్ని ప్యాకింగ్ చేస్తున్నాం.

-ఆర్.హరిశంకర్, టెక్నికల్‌అసిస్టెంట్, గోడౌన్ ఇన్‌చార్జి

## చికిత్సపొందుతూ ఒకరి మృతి

పాలకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన గర్భాణ లక్షుం (68) చికిత్సపొందుతూ మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గోపాలపురం వద్ద శుక్రవారం సాయంత్రం లక్షుం పొలానికి వెళ్లి తిరిగి గ్రామంలోకి వస్తున్నాడు. ఆ సమయంలో రోడ్డు దాటుతుండగా పాలకొండ వైపు నుంచి రాజాం వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు రఘు అనే వ్యక్తి ఢీకొన్నాడు. వెంటనే పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లక్షుం మరణించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తైక్వాండోలో సత్తాచాటిన క్రీడాకారులు

బొబ్బిలి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బొబ్బిలికి చెందిన 17 మంది క్రీడాకారులు ఒడిశాలోని కటక్‌లో గతనెల 30 నంచి ఈనెల ఒకటో తేదీ వరకూ జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లోని పలు కేటగిరీల్లో సత్తాచాటారు. వంజ రాపు భరత్‌కుమార్,పోతాబత్తుల జ్ఞాదీపక్, షేక్ అబ్దుల్లాలు బంగారు, శరవన్ చరణ్, షేక్ అహ్మద్, తస్విక్‌రావు, ప్రిన్స్ బాబు, సూర్యశశాంక్, శృతి కీర్తన, చాణక్య, శ్రీకర్ యాదవ్, కొండపల్లి ప్రణవ్‌లు కాంస్య, లిఖితరావు, వెంకట క్రితిన్, కిన్నరేష్, సృజన, నాగార్జునలు వెండి పతకాలను సాధించినట్లు కోచ్ ఎం.సుధాకర్‌యాదవ్ తెలిపారు.ఈ మేరకు బొబ్బిలిలో శుక్రవారం క్రీడాకా రులకు ఎమ్మెల్యే బేబీనాయన, డీఎస్పీ భవ్యారెడ్డిలు అభినందించారు.

## లేబర్ కోడ్‌లు ఆమోదించడం సరికాదు

బొబ్బిలి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రాష్ట్ర కేబినెట్ ఆమోదించడం సరికాదని సీఐటీయూ నాయ కులు పేర్కొన్నారు. శుక్రవారం బొబ్బిలి కోరాడవీధి జంక్షన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసనతెలిపారు. ఈసం దర్భంగా సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు మాట్లాడుతూ కొత్త నిబంధనల ప్రకారం ఎనిమిది నుంచి12 గంటల పనివిధానానికి తెరలేపడం దుర్మార్గ చర్యఅని తెలిపారు.లేబర్‌కోడ్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతీయ సమ్మెలో యావత్ కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## చెరకు రైతులకు అండగా ఉంటాం

బాడంగి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పది గ్రామాల్లో చెరకు పండించిన రైతుల వద్ద సేకరించి ఇక్కడి యూనిట్ ద్వారా ఎటువంటి రసాయనాలు ఉపయోగిం చకుండా బెల్లం విలువ ఆధారితఉత్పత్తులను తయారుచేయనున్నట్లు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్ముంనాయుడులు తెలిపారు. ఇక్కడి చెరకు పండించే రైతులకు అండగా ఉంటామని చెప్పారు. శుక్రవారం బాడంగి ఎత్తుఖానా వద్ద ఏర్పాటు చేయనున్న మినీ బెల్లం తయారీ యూనిట్‌కు ఎమ్మెల్యే, బుడా చైర్మన్ భూమిపూజ చేశారు. దీక్షా మహిళావెల్ఫేర్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో ఎన్‌పీవోను పీఎంఎఫ్ఎంఈ స్కీం ద్వారా ఆప్కాబ్, డీసీసీబీ బ్యాంకు సహకారంతో యూనిట్ ఏర్పాటు చేశారు.